కూటమి ఏడాది పాలనపై అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

- ప్రజలకు అండగా ఉండాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి

నరసాపురం: ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి కూటమి సర్కార్ నయవంచన పాలన సాగిస్తున్న తరుణంలో ప్రజలకు అండగా నిలబడాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు పార్టీ శ్రేణులకు సూచించారు. శుక్రవారం ముత్యాలపల్లిలో నిర్వహించిన పార్టీ మొగల్తూరు మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలకు మించి పథకాలను అమలు చేస్తామని హామీలు గుప్పించారని గుర్తుచేశారు. వాటిని అధికారంలోకి వచ్చాక మరిచారని విమర్శించారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ పథకాల్లో భారీగా కోతలు పెట్టారని వివరించారు. విద్యుత్ చార్జీలు అస్సలు పెంచమని చెప్పిన చంద్రబాబు ఏడాదిలోనే సర్ చార్జీలు ఇతర రూపాల్లో రూ.16 వేలకోట్లు వినియోగదారులపై భారం మోపారని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాడాలన్నారు. కష్టపడి పనిచేసే నాయకులకు పార్టీలో సముచిత స్థానం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. నరసాపురం నియోజకవర్గ అభివృద్ధికి తమ హయాంలో బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్, వశిష్ట వంతెన లాంటి కీలక ప్రాజెక్టులు మంజూరయ్యాయని వివరించారు. వాటని చిత్తశుద్ధితో కూటమి సర్కార్ పూర్తి చేయాలని కోరారు.

పునరాలోచనలో ప్రజలు

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ఇప్పుడు అందకపోవడంతో కూటమి ప్రభుత్వాన్ని ఎందుకు నెగ్గించామా? అని ప్రజలు ఆలోచనలో పడ్డారని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల అన్నారు. గద్దెనెక్కిన ఏడాదిలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 90 శాతం అమలు చేసిన చరిత్ర జగన్‌కి చెందితే, హామీలు అటకెక్కించి ఏడాదిలో పాలనలో ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన చరిత్ర కూటమి సర్కార్ సొంతం చేసుకుందని ఎద్దేవా చేశారు. రాబోయేది జగన్ ప్రభుత్వమేనని, పార్టీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగాలని సూచించారు. పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ సంక్షేమ పథకాల కోసం జగన్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మారుస్తున్నారని దారుణ ప్రచారం చేసిన కూటమి నాయకులు ఇప్పుడు అంతకంటే ఎక్కువ అప్పులు చేస్తూ ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విడిచిపెట్టారని ఆరోపించారు. ప్రజలకు ఇవ్వాల్సిన సొమ్ము ఎక్కడి పోతుందని ప్రశ్నించారు. ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న, నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పీడీ రాజు, ఉమ్మడి జిల్లా మత్స్యకారుల సొసైటీల సంఘం జిల్లా అధ్యక్షుడు అండ్రాజు చల్లారావు మాట్లాడారు. సమావేశంలో జెడ్పీటీసీ తరుమాని బాబ్జి, పార్టీ మండల అధ్యక్షుడు రేవు నారాయణరాజు, నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు ఉంగరాల రమేష్, తరుమాని నాగరాజు, పాలా రాంబాబు, తెన్నేటి గిరి, కటికల సూర్యారావు, కె.ముత్యేశ్వరరావు, అయితం ధనలక్ష్మి, సర్పంచ్ పడవల మేరీ, వైస్ ఎంపీపీ కవురు సీతామహాలక్ష్మి, మండల మహిళా కమిటీ అధ్యక్షురాలు కడలి గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.

సాగు ఇటు జోరు.. అటు బేజారు

- కాలువ ప్రారంభంలో జోరుగా వరి నాట్లు
- శివారు పొలాలకు అందని సాగునీరు
- రైతుల ఆవేదన



పెనుగొండలో పవర్ టిల్లర్‌తో దమ్ము చేస్తున్న రైతన్న



నారు పీకుతున్న రైతన్న

పెనుగొండ: ఖరీఫ్ సాగు ఓ ప్రాంతంలో జోరుగా సాగుతుంటే మరో ప్రాంతంలో సాగుకు రైతు బేజారెత్తి పోతున్నారు. కాలువలకు నీరు రావడంతో ఆచంట నియోజకవర్గంలో జూన్ 15 నుంచే సాగుకు శ్రీకారం చుట్టారు. నారుమడులు వేసుకొన్నారు. కాలువలకు నీరు రావడానికి తోడుగా, వారం రోజులుకు పైగా వర్షాలు సైతం కురవడంతో రైతులు అందరూ నారుమడులు సిద్ధం చేసుకొన్నారు. నియోజక వర్గంలో పెనుగొండ మండలంలో 11782 ఎకరాల్లో, పెనుమంట్ర మండలంలో 12103 ఎకరాల్లో, ఆచంట మండలంలో 10600 ఎకరాల్లో, పోడూరు మండలంలో 12800 ఎకరాల్లో వరి సాగు చేయడానికి సన్నద్ధం అవుతున్నారు. సార్వా సాగుకు అనువైన వరి వంగడాలైన ఎంటీయూ 1318, ఎంటీయూ 2072 (స్వర్ణ) రకాలను నారుమడులు వేసుకొని సాగు చేయడానికి సిద్ధమయ్యారు. అయితే, 10 రోజులుగా వరుణుడు దూరం కావడంతో శివారు ప్రాంతాల్లోని రైతులు వరిచేలు సాగు నీటి ఎద్దడితో బీటలు తీసి అవస్థలకు గురవుతున్నారు. కాలువ మొగల్లోని రైతులు మాత్రం జోరుగా నాట్లు వేస్తున్నారు. పంట కాలువల్లోని నీరు నేరుగా వరిచేలల్లో చేరుతుండడంతో గట్టులంకలు పటిష్టంగా వేసుకొని, చేతికందిన నారును తీసి నాట్లు వేసుకొంటున్నారు.

శివారు ప్రాంత రైతన్నలు గగ్గోలు

పెనుగొండ, ఆచంట మండలాల్లో అధిక ఆయకట్టు కోడేరు బ్యాంకు కెనాల్‌పై ఆధారపడి సాగు చేస్తున్నారు. బ్యాంక్ కెనాల్ నీరు శివారు ప్రాంతాలకు అంతంత మాత్రంగానే అందుతుంది. ముఖ్యంగా నడిపూడి, చినమల్లం లాంటి గ్రామాలకు సాగు నీరు అందడం గగనంగా మారింది. అదేవిధంగా వడలి సుబ్బారాయుడు పుంతలోనూ నీరు అందడం కష్టమవుతుదని రైతులు వాపోతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో నారుమడులు స్థాయిలోనే వరిచేలు బీటలు వారి సాగు చేయడం కష్ట సాధ్యంగా మారింది. వరి చేలు దమ్ము చేసుకొనే పరిస్థితి లేకుండా పోతుందని చెబుతున్నారు. అధికారులను సాగునీటి కోసం విన్నవించుకొంటే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సాగు ఆదిలోనే ఇబ్బందులు ఎదుర్కొంటే సాగు చేయడానికి నానావస్థలు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు.



నాట్లు వేస్తున్న కూలీలు



చిన్నం వారి పాలెంలో గట్టులంకలు సరిచేసుకొంటున్న రైతన్న



చినమల్లంలో ఎండుతున్న నారుమడులు

నేడు వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశం



నాయకులను అభినందిస్తున్న గోపి

పాలకొల్లు సెంట్రల్: అబద్ధపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ శనివారం కూటమి ప్రభుత్వం వైఫల్య పాలనపై నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటుచేశామన్నారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో మధ్యాహ్నం రెండు గంటలకు బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీపై సమావేశం ప్రారంభమవుతుందన్నారు. పార్టీ శ్రేణులంతా హాజరుకావాలని కోరారు. ఇటీవల పార్టీ జిల్లా, నియోజకవర్గ స్థాయిలో పదవులు పొందిన వీరా మల్లికార్జునుడు, చెన్ను విజయ్‌లను శాలువతో సత్కరించి అభినందనందించారు. నాయకులు యడ్ల తాతాజీ, జోగాడ ఉమామహేశ్వరరావు, దేవ రాజేష్, మామిడిశెట్టి చిట్టిబాబు, వాసంశెట్టి సుబ్బయ్య, చింతలపాటి మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల సమస్యలు పరిష్కరించాలి

పాలకొల్లు సెంట్రల్: సంచార జాతుల కులాలకు రావాల్సిన రాయితీలు, కులాల పేర్లు మార్పు చేయాలని సంచార జాతుల సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు అనచంద్ర ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో సంచార జాతుల సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పిలవడానికి అభ్యంతరకరంగా ఉన్న కులాల పేరు మార్పుచేయాలని తీర్మానించామన్నారు. స్థానిక సంస్థల్లో సంచార జాతులకు ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. సంచార జాతులకు 200 యూనిట్లు వరకు విద్యుత్ సబ్సిడీ అమలు చేయాలన్నారు. కార్పొరేషన్ ద్వారా ఉపాధి పొందే విధంగా రుణాలు మంజూరుకు కృషి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో నాయకుల భాస్కరరావు, వర్మ, ఆకుడి రామారావు, నాయకుల శ్రీను, భాస్కరరావు, ధానయ్య, రాసూరి శ్రీను, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో ఐఐటీ కళాశాల ఏర్పాటు చేయాలి

నరసాపురం: నరసాపురంలో ఐఐటీ కళాశాల ఏర్పాటు చేయాలని ఆర్ కృష్ణయ్య బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్డీఓ దాసి రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. బ్రిటీష్‌కాలం నుంచి ముఖ్య పరిపాలనా కేంద్రంగా కొనసాగిన నరసాపురం జిల్లా కేంద్రం అవుతుందని భావించామని అన్నారు. అయితే భీమవరం జిల్లా కేంద్రం కావడంతో నరసాపురం ప్రాధాన్యత తగ్గడమే కాకుండా, అభివృద్ధి పరంగా వెనకడుగు వేసిందని పేర్కొన్నారు. నరసాపురంలో ఐఐటీ ఏర్పాటు చేయడం ద్వారా మూడు జిల్లాల వారికి ఉపయోగంగా ఉంటుందని ప్రభుత్వానికి తెలియజేశామని వివరించారు.

క్లుప్తంగా

శాకంబరిగా వాసవీ మాత



పెనుగొండ: ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక వాసవీ మాత శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెనుగొండ వాసవీశాంతి ధాంలో శుక్రవారం ఉదయం నుంచి క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ స్వామిజీ (బాలా స్వామి) ఆశీస్సులతో మరకత శిల వాసవీ మాతకు అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ డాక్టర్ పీఎస్ గోవిందరాజులు దంపతులు పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు.

పెనుమంట్ర, మార్టేరులలో..



కంచి కామాక్షి



మహాలక్ష్మి

పెనుమంట్ర: స్థానిక పట్టాభి రామస్వామి ఆలయ ఆవరణలోని మహాలక్ష్మి, మార్టేరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర ఆలయ ఆవరణలో ఉన్న కామాక్షి అమ్మవార్లు శుక్రవారం శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెనుమంట్రలో ఆలయ కమిటీ చైర్మన్ కర్రి రామకృష్ణారెడ్డి (ఐటీ రాంబాబు) దంపతుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. మార్టేరు విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు.

పాఠశాలల్లో భోజనాల తనిఖీ



భోజనం రుచి చూస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని లంకలకోడేరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజులు నాయుడు గురువారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ బాగానే ఉన్నా రైస్ ముద్దవుతుందని ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ హయాంలో మెనూ నేటికి అదే అమలు చేస్తున్నారని చెప్పారు.

వైద్యానికి ఆర్థిక సాయం

పాలకొల్లు సెంట్రల్: పుట్టుకతోనే అంగవైకల్యంతో కదలలేని స్థితిలో బాధపడుతున్న చరణ్ (36)కు తన ఇంటి వద్ద శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు శిడగం సతీష్, సెక్రటరీ దోనెల ప్రసాద్, హెచ్ఎం భవానీప్రసాద్ పాల్గొన్నారు.

మందుల వితరణ

పాలకొల్లు సెంట్రల్: కొంత కాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాదపడుతున్న స్థానిక బ్రాడీపేట ఒకటో వీధికి చెందిన ఐ.నరేంద్రబాబుకు శుక్రవారం వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు రూ.18 వేలు విలువ చేసే మందులను ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అందజేశారు. నరేంద్రబాబుకు అవసరమైన మందులు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవడంతో తమను సంప్రదించినట్టు వాకర్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. క్లబ్ సభ్యులు షేక్ పీర్‌సాహెబ్, బసవరాజు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం అవసరం



ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు, న్యాయవాదులు

నరసాపురం: కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వం చాలా అవసరమని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు అన్నారు. శుక్రవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పెండింగ్ కేసుల పరిష్కారం, మధ్యవర్తిత్వం ప్రాధాన్యత, లోక్ అదాలత్ అవకాశం వంటి అంశాల్లో ప్రజల్లో అవగాహన కల్పించడానికి స్థానిక కోర్టు సముదాయం నుంచి శివాలయం సెంటర్ బస్టాండ్ మీదుగా 1కే వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గంగరాజు మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాలతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయడమే లక్ష్యమని తెలిపారు. న్యాయమూర్తులు ఆర్ వరలక్ష్మి, ఎస్ రాజ్యలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి

పెనుగొండ: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో విధులు బాధ్యతగా నిర్వహించాలని ఆచంట ఎంపీడీఓ బి.కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని కార్యదర్శులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓ ఓకేకే బులి సూరన్న పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

పెనుగొండ: టీబీ ముక్తిభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొడమంచిలిలో టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. టీబీ రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.హైందవి. కె.కాశీ, టీబీ సూపర్‌వైజర్ దుర్గాప్రసాద్, మోహన్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల ఎంపిక



వైఎస్సార్ సీపీ సగంచెరువు గ్రామ కమిటీ



వైఎస్సార్ సీపీ వరిదనం గ్రామ కమిటీ

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స ఏసురాజు అన్నారు. శుక్రవారం మండలంలోని సగంచెరువు, వరిదనం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీలను ఎంపిక చేశామని ఆయన తెలిపారు. నూతన కమిటీల సభ్యులు గ్రామాల్లో ప్రచారం చేస్తూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని కోరారు. సగంచెరువు గ్రామంలో గ్రామ సర్పంచ్ కడలి నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కోళ్ల దుర్గా వెంకట ప్రసాద్, సెక్రటరీ మోసుగంటి హేమంత్ మరో 35 మందిని కార్యవర్గ సభ్యులుగా నియమించామని తెలిపారు. వరదనం గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వర్దనపు మోహన్, సెక్రటరీ బుడితి దైవరాజులతో పాటు మరో 25 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశామని వివరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మైకేల్ రాజు, కోలాటి నవీన్, రెడ్డిమోసు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు అధికారులు



మాట్లాడుతున్న ఎస్సై పృథ్వి

నరసాపురం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నరసాపురం టౌన్ సీఐ బి.యాదగిరి సూచించారు. వైఎన్ కళాశాలలో శుక్రవారం డ్రగ్స్ నియంత్రణ, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితంలో అభివృద్ధికి కీలకమైందన్నారు. ఈ వయస్సులో దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఎందరో డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ వినియోగిస్తే చట్టప్రకారం శిక్షకు గురికాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేఖంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, డీన్ గంధం శ్రీరామకృష్ణ, ఎస్సై జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

పాలకొల్లు సెంట్రల్: ఒక మనిషి ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే చదువుకన్నా ముఖ్యమైనది క్రమశిక్షణ అని ఆ క్రమశిక్షణ ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పట్టణ ఎస్సై జి.పృథ్వి అన్నారు. శుక్రవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మాదకద్రవ్యాలపై ఓ యువత మేలుకో కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థికీ చదువు చాలా ముఖ్యమన్నారు. తల్లిదండ్రులు తిన్నా తనకపోయినా కష్టపడి కూడబెట్టిన సొమ్మంతా తమ పిల్లల విద్యకే కేటాయిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రుల కష్టాన్ని పట్టించుకోని కొందరు విద్యార్థులు అక్రమ మార్గాలు వెతుక్కుని తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమపై ఎంతో నమ్మకం పెట్టుకుని విద్యాసంస్థలకు పంపిస్తున్న విషయాన్ని విద్యార్థులు గుర్తెరగాలని సూచించారు. తొలుత కళాజాత కళాకారులతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై మార్‌లింగం, ఎం శివాజీ, ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ, ఎ.వంశీ, అధ్యాపకులు వి.యామిని, వి.విజయలక్ష్మి, ఎం రామకృష్ణ, కె.భద్రాచలం, బూసి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



అవగాహనా ర్యాలీలో నినదిస్తున్న వైద్యులు



ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ నవ్యజీవన్

నరసాపురం: స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్ సుప్రియ మాట్లాడుతూ కాన్పుకు, కాన్పుకు మధ్య 2 నుంచి 3 సంవత్సరాలు వ్యత్యాసం ఉండేలా భార్యాభర్తలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన బిడ్డల జననం కోసం ముందస్తు ప్రణాళిక అములు చేయాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. ప్రపంచంలో అధిక జనాభాలో మనదేశం అగ్రస్థానంలో ఉందన్నారు. డాక్టర్ కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు బిడ్డకు మధ్య వ్యత్యాసం అవసరం

పాలకొల్లు సెంట్రల్: ప్రపంచ జనాభాలో అధిక శాతం మంది ఒక్క బిడ్డతో కుటుంబ నియంత్రణ పాటిస్తున్నారని, అలా కాకుండా ఇద్దరు లేక ముగ్గురు పిల్లలు ఉండేలా ఆలోచన విధానం మార్చుకోవాలని డాక్టర్ నవ్య జీవన్ అన్నారు. శుక్రవారం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రపంచ జనాబా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డా నవ్య జీవన్ మాట్లాడుతూ పుట్టే బిడ్డలకు మధ్య కనీసం రెండు లేక మూడేళ్లు వ్యవధి ఉండేలా చూసుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల తల్లి ఆరోగ్యం బిడ్డ ఆరోగ్య మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరి బాబు, ఎలిజిబెత్, ఎస్‌కే అమలేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవాలి

పెనుగొండ: విద్యార్థి స్థాయి నుంచే ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవాలని ఎస్సై కె.గంగాధర్ విద్యార్థులకు సూచించారు. పెనుగొండ విశ్వతేజలో మేరా యువ భారత్ జిల్లా విభాగం, భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో వారధి సోషల్ సర్వీస్ ఆర్గనేజన్ జనాభా దినోత్సవం నిర్వహించాచు. ప్రపంచంలో జనాభా పెరుగుతూ వెళుతుంటూ, రాష్ట్రంలో జనాభా పెరుగుదల కుంటుపడిందని అన్నారు. దీనికి కారణం యువత ఆర్థిక స్థిరత్వం కోసం ఆలోచిస్తూ, పిల్లల ఆలోచన వెనక్కి నెడుతున్నారని తెలిపారు. పెనుగొండ న్యాయవాది మద్దింశెట్టి వెంకటేశ్ మాట్లాడుతూ వంద దేశాలకు పైగా ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తుందని చెప్పారు. ప్రిన్సిపాల్ లక్షణ్, సూర్యనారాయణ, వారిధి వ్యవస్థాపకులు కామాక్షి రవి సిన్హా, కామాక్షి లావణ్యలు పాల్గొన్నారు.